ప్రజాశక్తి
గురువారం 30 అక్టోబరు, 2025
5
శ్రీకాకుళం



నేడు రాష్ట్ర టెన్నికాయిట్ జట్టు ఎంపిక

ప్రజాశక్తి - పలాస

పలాస ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్రీడామైదానంలో గురువారం ఉదయం 10 గంటలకు 18 ఏళ్ల లోపు విభాగంలో బాలబాలికల టెన్నికాయిట్ ఎంపికలు నిర్వహిస్తున్నట్లు జిల్లా టెన్నికాయిట్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు మల్లా సంతోష్‌కుమార్, సుడియా వెంకట జోగారావు, రాష్ట్ర టెన్నికాయిట్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు పి.తవిటయ్య ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఎంపికలో పాల్గొను క్రీడాకారులు 1.1.2007 తర్వాత పుట్టిన వారై ఉండాలన్నారు. ఎంపికలకు వచ్చే క్రీడాకారులు, ధ్రువీకరణ పత్రం, ఆధార్ కార్డు, నాలుగు పాస్‌పోర్టు సైజ్ ఫొటోలు తీసుకురావాలని తెలియజేశారు. ఎంపికైన క్రీడాకారులు నవంబరులో 7,8,9 తేదీల్లో బాపట్ల జిల్లా చీరాలలో నిర్వహించనున్న రాష్ట్ర పోటీల్లో పాల్గొంటారని తెలిపారు.

మొంథా మిగిల్చిన నష్టం



పలాస : ఉధృతంగా ప్రవహిస్తున్న వరహాల గెడ్డ

- జిల్లాలో పలు ప్రభుత్వ శాఖలకు రూ.1.24 కోట్లు నష్టం
- పది మండలాల్లోని 53 గ్రామాలపై ప్రభావం
- 5,582.98 ఎకరాల్లో పంటలకు నష్టం
- నేలకొరిగిన 275 కొబ్బరి చెట్లు
- వరహాలగెడ్డలో ఒకరు గల్లంతు

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

మొంథా తుపాను జిల్లాకు తీవ్ర నష్టాన్ని మిగిల్చింది. వర్షాలు, ఈదురుగాలుల తీవ్రతకు జిల్లాలోని పలు ప్రభుత్వ శాఖలకు సుమారు రూ.1.24 కోట్ల నష్టం వాటిల్లినట్లు అధికారులు ప్రాథమికంగా గుర్తించారు. వరి, ఇతర ఉద్యాన పంటలు కలిపి రూ.5,582.98 ఎకరాల్లో దెబ్బతిన్నట్లు అంచనా వేశారు. గాలుల ఉధృతికి విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. ఒడిశాలో కురిసిన వర్షాలకు బాహుదాలో వరద ఉధృతి కొనసాగుతోంది. వంశధార, నాగావళిలో వరద ప్రవాహం క్రమేణా పెరుగుతోంది. పలాస మండలం వరహాలగెడ్డలో ఒకరు గల్లంతయ్యారు. తుపాను ప్రభావంతో జిల్లాలో పలుచోట్ల మోస్తరు వర్షాలు కురిశాయి. కవిటి మండలం రాజపురంలో అత్యధికంగా 21.75 మి.మీ వర్షం కురిసింది.



ఇచ్ఛాపురం : పరిశీలిస్తున్న ఇన్‌ఛార్జి కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్

ఉధృతంగా ప్రవహిస్తున్న గెడ్డలు

పలాస మండలంలోని బ్రాహ్మణతర్లా, కంబిరిగాం వరహాల గెడ్డ ఉధృతంగా ప్రవహిస్తోంది. వంతెన పైనుంచి మూడు అడుగుల ఎత్తులో నీరు ప్రవహించడంతో బ్రాహ్మణతర్లా, లక్ష్మీపురం, బంటుకొత్తూరు, నీలి భద్ర, కేశుపురం, పెద నారాయణపురం, పెదంచల, కేదారిపురం, ఈదురాపల్లి, గంగువాడ, చినంచల తదితర ప్రాంతాలకు రాకపోకలు నిలిచిపోయాయి. అమలకుడియా, పూర్ణభద్ర గెడ్డ ఉధృతంగా ప్రవహించడంతో గ్రామాల్లోకి వరద నీరు వచ్చి చేరింది. గ్రామాల చుట్టూ నీరు చేరడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఈ ప్రాంతంలో కూడా రాకపోకలు నిలిచిపోయాయి. కిష్టుపురం రైల్వే అండర్ పాసేజ్ లోకి వరద నీరు వచ్చి చేరడంతో రాకపోకలు నిలిచిపోయాయి. లావేరు మండలంలోని బుడుమూరు పెద్దగెడ్డ పొంగిపొర్లుతోంది. దీని ప్రభావంతో అదపాక, గుర్రాలపాలెం రహదారిపై రాకపోకలు నిలిచిపోయాయి. వరద నీటి ఉధృతికి రహదారి కోతకు గురైంది. తహశీల్దార్ శ్రీనివాసరావు, ఆర్అండ్‌బి జెఇ ఆంజనేయరాజులు జెసిబితో తాత్కాలిక రహదారి పనులు చేయించారు. కంచిలి మండలం డి.జి పురం సమీపంలో కల్వర్టుకు గండి పడడంతో రహదారిపై రాకపోకలు నిలుపుదల చేశారు. సోంపేట మండలంలోని పలాసపురం నుంచి జాతీయ రహదారికి వెళ్లే రహదారిలో ఉన్న కల్వర్టు వరద ప్రవాహానికి కొట్టుకుపోయింది. పొందూరు మండలంలోని లైదాం వద్ద వంతెన పైనుంచి రెల్లిగెడ్డ ప్రవహిస్తుండడంతో సంతకవిటి-పొందూరు మండలాల మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. వంతెన పైనుంచి ప్రయాణాలు జరగకుండా అధికారులు చర్యలు చేపట్టారు. పెనుబర్తి, బొడ్డేపల్లి వద్ద రైల్వే అండర్‌పాసేజ్‌లో నీరు నిలిచిపోవడంతో రాకపోకలు సాగించేందుకు వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. తోలాపి జిల్లాపరిషత్ ఉన్న పాఠశాల ఆవరణలో వరదనీరు మంచెత్తింది. పాఠశాల ఆవరణమంతా మునిగిపోవడంతో అధికారులు ఇంజిన్ల సహాయంతో వరదనీటిని బయటకు తరలిస్తున్నారు. అదే గ్రామంలోని పశువైద్య కేంద్రం చుట్టూ వరదనీరు చేరింది.



పొందూరు : రెల్లిగెడ్డపై రాకపోకలు సాగిస్తున్న ప్రజలు

5,582 ఎకరాల్లో పంట నష్టం

తుపాను ప్రభావంతో జిల్లాలో సుమారు 5,582.98 ఎకరాల్లో పంటలకు నష్టం వాటిల్లింది. అందులో జిల్లాలో వరి పంటకు సంబంధించి 4,801 మంది రైతులకు చెందిన 5,568.75 ఎకరాల్లో వరి పంట దెబ్బతింది. జిల్లాలో 13 మండలాల పరిధిలోని 120 గ్రామాల్లో పంట నష్టం సంభవించినట్లు అధికారులు గుర్తించారు. పత్తి పంట సుమారు 13 ఎకరాల్లో దెబ్బతింది. ఇచ్ఛాపురం, పాతపట్నం, నందిగాం, వజ్రపుకొత్తూరు, ఎచ్చెర్ల మండలాల్లో వరి, కొత్తూరు మండలంలో పత్తి పంటకు నష్టం వాటిల్లినట్లు గుర్తించారు. తుపాను, ఈదురుగాలుల కారణంగా ఉద్యాన పంటలకు 14.23 ఎకరాల మేర నష్టం వాటిల్లినట్లు జిల్లా ఉద్యానశాఖ అధికారి రత్నాల వరప్రసాద్ తెలిపారు. 28 ఎకరాల్లో జీడి, 1.12 ఎకరాల్లో అరటి, ఎకరా విస్తీర్ణంలో బొప్పాయి, ఐదు ఎకరాల్లో కూరగాయలు, పంటలకు నష్టం సంభవించింది. మందస, వజ్రపుకొత్తూరు మండలాల్లో జీడి పంటకు, పలాసలో కూరగాయల సాగు తీవ్రంగా ప్రభావితమైంది. కవిటి, కంచిలి, వజ్రపుకొత్తూరు మండలాల్లో సుమారు 278 కొబ్బరి మొక్కలు నేలకొరిగాయి.

కంచిలిలో వరదలో చిక్కుకున్న బస్సు

కంచిలి మండలం రహదారిపై అర్జునపురం వద్ద వరద నీటిలో ఆర్‌టిసి బస్సు చిక్కుకుంది. రోడ్డు కోతకు గురి కావడంతో కంచిలి వైపు నుంచి కేసరిపడ మీదుగా కేబినౌగాం వెళ్తున్న ఆర్టీసీ బస్సు అర్జునపురం వద్ద వరద నీటిలో ఇరుక్కుపోయింది. ప్రయాణికులను దించివేసి ట్రాక్టర్ సాయంతో గ్రామస్తులు బస్సును వరద నీటి నుంచి బయటకు తీశారు.

జిల్లాలో పలుచోట్ల మోస్తరు వర్షాలు

తుపాను ప్రభావంతో జిల్లాలో పలుచోట్ల మోస్తరు వర్షాలు కురిశాయి. కవిటి మండలం రాజపురంలో అత్యధికంగా 21.75 మి.మీ వర్షం కురిసింది. లావేరులో 11.75 మి.మీ, హిరమండలంలో 9.5 మి.మీ, ఇచ్ఛాపురంలో 7.5 మి.మీ, ఎచ్చెర్ల, పలాస, పాతపట్నంలో 7.5 మి.మీ చొప్పున వర్షం కురిసింది. శ్రీకాకుళంలో 6.25 మి.మీ వర్షం పడింది. కోటబొమ్మాళిలో అత్యల్పంగా 0.5 మి.మీ వర్షపాతం నమోదైంది.



కంచిలి : ఆర్‌టిసి బస్సును తాడుతో లాగుతున్న ట్రాక్టర్

విద్యుత్‌శాఖకు రూ.11.93 లక్షల నష్టం

తుపాను ప్రభావంతో జిల్లాలో విద్యుత్‌శాఖకు సుమారు రూ.11.93 లక్షల మేర నష్టం వాటిల్లినట్లు ఎపిఇపిడిసిఎల్ ఎస్‌ఇ ఎన్.కృష్ణమూర్తి తెలిపారు. వర్షాలు, ఈదురుగాలుల తీవ్రతకు 61 ఎల్‌టి స్తంభాలు, 36 11-కెవి స్తంభాలతో పాటు 27 విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్స్, 33 కెవిఫీడర్స్, 11 కెవి ఫీడర్స్ 12 దెబ్బతిన్నాయని చెప్పారు. వర్షాలు ఒకవైపు పడుతున్నా ప్రజలకు విద్యుత్ సరఫరాకు ఇబ్బంది లేకుండా వెంటనే పునరుద్ధరణ చర్యలు చేపట్టామని వెల్లడించారు.

తుపాను ధాటికి దెబ్బతిన్న 44 ఇళ్లు

లావేరులోని వస్త్రపురి కాలనీలో ఉప్పు అప్పారావుకు చెందిన పెంకుటిల్లు గోడ కూలిపోయింది. వృద్ధులైన భార్యాభర్తలు ఆ సమయంలో ఇంట్లోనే ఉన్నారు. బయట వైపు గోడ కూలిపోవడంతో ఎటువంటి ప్రాణాపాయం లేదు. కంచిలి మండలం పద్మతుల గ్రామంలో ఉయ్యూరు దానమ్మకి చెందిన ఇంటి గోడ కూలిపోయింది. తుపాను ధాటికి మొత్తంగా 44 ఇళ్లు దెబ్బతిన్నట్లు అధికారులు గుర్తించారు. వీటిలో ఏడు ఇళ్లు పూర్తిగా, 34 ఇళ్లు పాక్షికంగా దెబ్బతిన్నట్లు గుర్తించారు. వీటి విలువ రూ.7.06 లక్షలుగా అంచనా వేశారు. ఒక ఆవుతో పాటు ఎనిమిది మేకలు మృత్యువాత పడ్డాయి. వీటి విలువ రూ.1.1 లక్షలుగా ఉంది.

పలాసలో ఒకరు గల్లంతు



లావణ్య (ఫైల్)

పలాస మండలం దానగోరకు చెందిన సవర లావణ్య (లెబున్) (35) కంబిరిగాం కూడలి వరహాల గెడ్డలో బుధవారం గల్లంతయ్యాడు. ఉధృతంగా ప్రవహిస్తున్న గెడ్డలో చేపలు పట్టడానికి గ్రామానికి చెందిన పది మంది యువకులు గెడ్డకు వచ్చారు. సవర లావణ్య పెద్ద చేప పట్టుకొనే క్రమంలో జారీ పడి గెడ్డలో కొట్టుకుపోయాడు. ఆ సమయంలో ఉన్న తోటి స్నేహితులు కాపాడేందుకు ప్రయత్నం చేసినా ఫలించలేదు. విషయం తెలుసుకున్న తహశీల్దార్ టి.కళ్యాణచక్రవర్తి, కాశీబుగ్గ ఎస్ఐ నరసింహమూర్తి ఘటనా స్థలాన్ని పరిశీలించారు. అగ్నిమాపక సిబ్బంది, ఎన్‌డిఆర్‌ఎఫ్ సిబ్బంది గాలింపు చర్యలు చేపడుతున్నారు.

ముంపు పొలాలు పరిశీలన

ఇచ్ఛాపురం మండలంలో తుపాను ప్రభావంతో ముంపునకు గురైన పంట పొలాలను ఇన్‌ఛార్జి కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్, వ్యవసాయ శాఖ అధికారులు బుధవారం పరిశీలించారు. డొంకూరు, ఈదుపురం, జగన్నాథపురం, రక్తకన్నా, బెల్లుపడలో బాహుదా నది ఉధృత ప్రవాహానికి సుమారు 2795 ఎకరాల్లో వరి పంట నీటమునిగింది. వ్యవసాయశాఖ సోంపేట ఎడిఎ భవానీ శంకర్, కృషి విజ్ఞాన కేంద్రం కోఆర్డినేటర్ భాగ్యవతి, శాస్త్రవేత్తలు ఉదయభాను, శ్రీనివాసరావు, ఇచ్ఛాపురం మండల వ్యవసాయాధికారి అజయ్ పంటలను పరిశీలించారు. నీరు పూర్తిగా తగ్గిన తర్వాత పంట నష్టాన్ని అంచనా వేసి సంబంధిత నివేదికలను సిద్ధం చేయనున్నట్లు తెలిపారు.



నీట మునిగిన వరి పంట

శాంతించిన బాహుదా

ఒడిశాలో కురుస్తున్న వర్షాలతో బాహుదా నది ఉధృతంగా ప్రవహించింది. బుధవారం ఉదయం ఎనిమిది గంటల వరకు 51 వేల క్యూసెక్కులు ప్రవహించడంతో మొదటి ప్రమాద హెచ్చరికను కొనసాగించారు. తర్వాత క్రమేణా శాంతించింది. ప్రస్తుతం 42 వేల క్యూసెక్కుల నీరు ప్రవహిస్తోంది. వంశధారలో వరద ప్రవాహం క్రమేణా పెరుగుతోంది. ప్రస్తుతం 36,500 క్యూసెక్కుల వరద ప్రవాహం కొనసాగుతోంది. 40 వేల క్యూసెక్కుల వరకు పెరిగే అవకాశాలు ఉన్నాయని అధికారులు వెల్లడించారు. నాగావళిలో స్వల్పంగా నీటి ప్రవాహం పెరిగింది. ప్రస్తుతం 30 వేల క్యూసెక్కుల వరద ప్రవహిస్తోంది.



2న ఆర్‌ఆర్‌బి, గ్రూప్-డి మాక్‌టెస్టు

ప్రజాశక్తి - శ్రీకాకుళం సిటీ

కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు చేపడుతున్న కార్యక్రమం ఎర్రన్న విద్యా సంకల్పంలో భాగంగా ఆర్‌ఆర్‌బి, గ్రూప్-డి పోటీ పరీక్షలకు సన్నద్ధమయ్యే అభ్యర్థులకు ఆఖరి మాక్ టెస్ట్‌ను నవంబరు రెండో తేదీన నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. శ్రీకాకుళం నగరంలోని ఉమెన్స్ కళాశాల రోడ్ దరిలోని కాకినాడ ఆదిత్య డిగ్రీ కళాశాలలో పరీక్షా కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. మాక్ టెస్ట్ రిజిస్ట్రేషన్ లింక్ https://www.yvssrikakulam.live/register నమోదు చేసుకున్న అభ్యర్థులు పరీక్ష రోజు ఉదయం పది గంటలకు హాజరు కావాలని తెలిపారు. గతంలో రిజిస్టర్ చేసుకున్నా, మరోసారి నమోదు చేసుకుని హాల్ టిక్కెట్‌ను పొందాలని పేర్కొన్నారు. శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం, విశాఖపట్నం జిల్లాలకు చెందిన నిరుద్యోగులకు, పోటీ పరీక్షలకు సన్నద్ధమయ్యే వారికి ఈ మాక్ టెస్ట్‌లు ఎంతగానో ఉపయోగపడతాయని తెలిపారు. ఉత్తరాంధ్ర విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

1 నుంచి చివరి విడత కౌన్సెలింగ్

ప్రజాశక్తి - శ్రీకాకుళం సిటీ

ఎపిఇఎపి సెట్-2025 ఫార్మసీ బైపిసి స్ట్రీమ్ చివరి విడత కౌన్సెలింగ్ నవంబర్ ఒకటో తేదీ నుంచి నిర్వహణకు నోటిఫికేషన్ విడుదలైనట్లు శ్రీకాకుళం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ కె.నారాయణరావు ఒక ప్రకటనలో తెలిపారు. 1 నుంచి 4వ తేదీ మధ్య ఫీజు చెల్లింపు, 3 నుంచి 5వ తేదీ వరకు ధ్రువీకరణ పత్రాల పరిశీలన, ఆప్షన్ల ఎంపిక, 6న ఆప్షన్ల మార్పు, 7న సీట్లు ఎలాట్‌మెంట్ ఉంటుందని తెలిపారు. 8వ తేదీ నుంచి క్లాస్ వర్క్ ఉంటుందని, కళాశాలల్లో 12వ తేదీలోపు చేరాలని పేర్కొన్నారు. వెబ్ కౌన్సెలింగ్‌లో ఇబ్బందులు ఉంటే పాలిటెక్నిక్ కళాశాలలో ఏర్పాటు చేసిన సహాయ కేంద్రాన్ని సంప్రదించాలని సూచించారు.

ప్రజారోగ్య వ్యవస్థను ప్రభుత్వమే నిర్వహించాలి

ప్రజాశక్తి - అరసవల్లి

పేద, మధ్యతరగతి ప్రజలకు వైద్యాన్ని, వైద్య విద్యను దూరం చేసే ప్రభుత్వ వైద్య కళాశాలల ప్రైవేటీకరణను ప్రభుత్వం విడనాడాలని జన విజ్ఞాన వేదిక రాష్ట్ర కార్యదర్శి గొంటి గిరిధర్ డిమాండ్ చేశారు. ప్రజారోగ్య వ్యవస్థను ప్రభుత్వమే నిర్వహించాలన్నారు. జన విజ్ఞాన వేదిక ప్రచురించిన 'పిపిపి పేరుతో వైద్య కళాశాలల ప్రైవేటీకరణ వద్దు' బుక్‌లెట్‌ను నగరంలోని యుటిఎఫ్ భవన్‌లో ప్రజాసంఘాల నాయకులు బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా గిరిధర్ మాట్లాడుతూ ప్రజారోగ్య వ్యవస్థకు జిడిపిలో ఐదు శాతం నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. సాహితీ స్రవంతి జిల్లా కార్యదర్శి కేతవరపు శ్రీనివాసు మాట్లాడుతూ సంక్షేమ రంగాల బాధ్యత ప్రభుత్వాలదేనని స్పష్టం చేశారు. పేదలకు వైద్యాన్ని, వైద్య విద్యను దూరం చేసే విధానాలు, కార్పొరేట్ల దయాదాక్షిణ్యాలపై ప్రజల ఆరోగ్యం ఉండడం సరికాదన్నారు. కేరళ తరహా ప్రజా వైద్య విధానాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా అధ్యక్షులు సిహెచ్.అమ్మన్నాయుడు, శ్రామిక మహిళా సమన్వయ కమిటీ జిల్లా కన్వీనర్ కె.నాగమణి, జెవివి జిల్లా ఉపాధ్యక్షులు పి.కూర్మారావు, గరిమెళ్ల అధ్యయన వేదిక అధ్యక్షులు పి.సుధాకర్, ప్రముఖ రచయిత కంచరాన భుజంగరావు, ఎపి మోడల్ స్కూల్ టీచర్స్ ఫెడరేషన్ నాయకులు బాడాన శ్యామలరావు, జెవివి జిల్లా కోశాధికారి వి.ఎస్ కుమార్, శివకుమార్ పాల్గొన్నారు.



బుక్‌లెట్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

మెరుగైన వైద్య సేవలందించాలి



మాట్లాడుతున్న జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి అనిత

ప్రజాశక్తి - గార

ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో మెరుగైన వైద్య సేవలు అందించాలని జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి అనిత అన్నారు. కళింగపట్నం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని బుధవారం సందర్శించారు. బడివానిపేట, డి.మత్స్యలేశం గ్రామాల్లో ఏర్పాటు చేసిన వైద్య శిబిరాలను పరిశీలించారు. ప్రజలకు అందుతున్న వైద్యసేవలు, మందుల సరఫరా గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆమె గ్రామ ప్రజలతో నేరుగా మాట్లాడి, వైద్యసేవలు అందుబాటులో ఉన్న తీరు, ఆరోగ్య సమస్యలపై ఆరా తీశారు. ప్రజలందరూ ఆరోగ్యం విషయంలో అప్రమత్తంగా ఉండాలని, సీజనల్ వ్యాధులపై జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. వైద్య సిబ్బంది గ్రామాల్లో ప్రత్యేక వైద్య సేవలందించాలని సూచించారు.

రోడ్డూ లేదు... పక్కా ఇల్లూ లేవు

సిపిఎం నాయకుల వద్ద గోడు వెళ్లబోసుకున్న బల్లిగాం గిరిజనులు

ప్రజాశక్తి - సోంపేట

తుపాను ప్రభావిత గ్రామాల్లో పంటలు, పునరావాస కేంద్రాలను సిపిఎం ప్రతినిధి బృందం బుధవారం పరిశీలించింది. మండలంలోని పైడిగాంలో పునరావాస కేంద్రాన్ని పరిశీలించిన సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కె.మోహనరావు, జిల్లా కమిటీ సభ్యులు పోలాకి ప్రసాదరావు, సంగారు లక్ష్మీనారాయణ గిరిజనుల సమస్యలను తెలుసుకున్నారు. నేటికీ బల్లిగాం గిరిజన గ్రామానికి రోడ్లు, పక్కా ఇళ్లు లేవని గిరిజనులు తెలిపారు. సొంతిల్లు నిర్మాణం కోసం ప్రభుత్వానికి పలుమార్లు దరఖాస్తులు చేసినా నేటికీ మంజూరు చేయలేదని చెప్పారు. పూరిల్లు కావడంతో గాలి, వర్షాలకు పునరావాస కేంద్రానికి వచ్చి ఉంటున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికైనా బల్లిగాం గిరిజనులకు పక్కా ఇల్లు, గ్రామానికి రోడ్లు మంజూరు చేయాలని సిపిఎం నాయకులు డిమాండ్ చేశారు. విద్య, వైద్యానికీ గిరిజనులు ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లాలో ఐటిడిఎ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సవర జయరాం, సవర బైలోడు తదితరులు పాల్గొన్నారు.



పునరావాస కేంద్రంలో గిరిజనులతో మాట్లాడుతున్న సిపిఎం నాయకులు

కోర్టు తీర్పు అమలు చేయాలి

ప్రజాశక్తి - శ్రీకాకుళం సిటీ

2002లో హెల్త్ అసిస్టెంట్ల ఉద్యోగాల నియామకానికి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేసి ఉద్యోగ నియామకాలు చేపట్టిందని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు బి.మురళీ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నోటిఫికేషన్ విడుదలైన నాటి నుంచి అనేక లీగల్ లిటిగేషన్ ఎదుర్కొంటూ 2012, 2015, 2024లో కొంతమందిని తొలగించడంతో కోర్టు చుట్టూ తిరుగుతున్నారని పేర్కొన్నారు. 1207 మంది 21 ఏళ్లుగా పనిచేస్తుండడంతో, వారి సేవలను గుర్తిస్తూ మానవతా దృక్పథంతో వారిని విధులకు తీసుకోవాలని హైకోర్టు తీర్పునిచ్చిందని తెలిపారు. ఈ తీర్పు అమలు చేసి ఉద్యోగాల్లో తీసుకోవాలని కోరారు. ప్రస్తుతం వీరు ఎదుర్కొంటున్న ఆర్థిక ఇబ్బందులను పరిగణలోకి తీసుకొని ప్రభుత్వం స్పందించాలని కోరారు.



నువ్వా...నేనా..!

పొందూరు మండలంలోని కొంచాడకు చెందిన గొర్రెల పెంపకందారులు గొర్రెల మందను బుధవారం మేతకు తీసుకువెళ్లారు. అందులోని రెండు పొట్టేళ్లు ఒక్కసారిగా ఒకదానికొకటి తలపడ్డాయి. . ఆ రెండు పొట్టేళ్లను నిలువరించేందుకు పెంపకందారులు ప్రయత్నించినా, కాసేపటికే మళ్లీ పోటీ పడ్డాయి. పొందూరు నుంచి రైల్వేస్టేషన్‌కు వెళ్లే రోడ్డుపై నువ్వా.. నేనా అంటూ సాగుతున్నట్లు ఉన్న పోట్లాటను స్థానికులు ఆసక్తిగా తిలకించారు.

- ప్రజాశక్తి, పొందూరు

కాశీబుగ్గలో దొంగలు హల్‌చల్

- ఐదు దుకాణాల్లో చోరీ
- భారీగా నగదు అపహరణ

ప్రజాశక్తి - పలాస

ప్రజలు, అధికారులు, పోలీసులంతా తుపాను హడావిడిలో ఎవరి విధుల్లో వారు ఉన్నారు. దొంగలు మాత్రం అర్ధరాత్రి వేల తాళాలు వేసిన నాలుగు షాపుల్లో చోరీకి పాల్పడ్డారు. నిత్యం రద్దీగా ఉండే శ్రీనివాస లాడ్జి కూడలి, పాత జాతీయ రహదారి, కాశీబుగ్గ పెట్రోలు బంకు సమీపంలో ఉన్న మొత్తం మూడు ఔషధ దుకాణాలు, ఒక ట్రావెల్, ఇంటర్నెట్ సెంటరులో చోరీకి పాల్పడ్డారు. మొత్తం రూ.4.11 లక్షల నగదు అపహరించినట్లు షాపు యజమానులు కాశీబుగ్గ పోలీసులకు ఫిర్యాదు చేశారు. రంగంలోకి దిగిన క్లూస్ టీమ్ సభ్యుల బృందం దొంగల వేలిముద్రలు సేకరించి వారిని గుర్తించే పనిలో ఉన్నారు. దీనికి సంబంధించిన వివరాలు... శ్రీనివాసలాడ్జి కూడలిలో తంగుడు సాంబమూర్తి మెడికల్ స్టోర్ తాళాలు పగల కొట్టి దొంగలు లోపలకు ప్రవేశించారు. ఏజెన్సీ నిర్వాహకులకు కోసం బ్యాగులో దాచి ఉంచిన రూ.3.65 లక్షల నగదు అపహరించారని యజమాని సురేష్ కుమార్ తెలిపారు. తాము రాత్రి 10.30 గంటల వరకూ షాపును తెరిచి ఉంచామని, బుధవారం ఉదయం బ్యాంకులో జమ చేయడానికి దాచిన డబ్బంతా దోచుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వర్షాలు కావడంతో నగదు బ్యాంకులో వేయలేకపోయామని, ఏజెంట్లందరికీ ఇవ్వడానికి ఉంచిన డబ్బంతా పోవడంతో వారికి ఏమి సమాధానం చెప్పగలమని ఆందోళన వ్యక్తం చేశారు. ఇదే ప్రాంతంలో ఉన్న రామకృష్ణ మెడికల్ స్టోర్‌లోనూ దొంగలు చొరబడ్డారు. షాపులో రూ.40 వేల నగదు బ్యాగులో ఉంచడంతో దాన్ని దొంగిలించారు. అనంతరం పాత జాతీయ రహదారి కాశీబుగ్గ పెట్రోలు బంకు సమీపంలో ఉన్న లక్ష్మి మెడికల్ స్టోర్స్ తాళాలు పగల కొట్టి నగదు, విలువైన సామగ్రి దొంగిలించారు. షాపు మేడపై ఉన్న ఇంటర్నెట్ సెంటరులో డస్క్ దాచి ఉంచిన రూ.6 వేలు నగదుతో ఉడాయించారు.



ఆధారాలను సేకరిస్తున్న క్లూస్ టీమ్

సంబంధిత షాపులకు సిసి కెమెరాలు ఉన్నా వర్షాలు కారణంగా అవి మొరాయించాయి. దీంతో ఎంత మంది దొంగలు వచ్చి దొంగతనానికి పాల్పడిందీ తెలియడం లేదు. కెటి రోడ్డు, పాత జాతీయ రహదారిపై ఉన్న పోలీసు నిఘా కెమెరాల్లో చోరీ వ్యవహారం నిర్లిప్తమై ఉంటుందని పోలీసులు చెబుతున్నారు. శ్రీకాకుళం జిల్లా పోలీసు కేంద్రంలో ఉన్న కంట్రోల్ రూములో దీన్ని పరిశీలించాల్సి ఉంది. సంఘటన స్థలానికి క్లూస్టమ్ సభ్యులు వచ్చి దొంగల వేలిముద్రలు సేకరించారు. ఇదే ప్రాంతంలో రెండు నెలల క్రితం ఓ మొబైల్ స్టోర్‌లో రూ.1.20 లక్షల నగదు ఇదే తరహాలో చోరీకి గురైంది. ఎస్ఐ నరసింహమూర్తి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ప్రజాశక్తి
www.prajasakti.com

'మొంథా'తో అపార నష్టం


పొందూరు : నేల వాలిన వరిపంటను కట్టలు కడుతున్న మహిళలు

పొందూరు: మొంథా తుఫాన్ ప్రభావంతో మూడు రోజులుగా కురిసిన వర్షాలు, వీచిన గాలులకు మండలంలోని పలు గ్రామాల్లో అపారనష్టం వాటిల్లింది. తీవ్రంగా కురిసిన వర్షాలకు మండలంలోని వాగులు, గెడ్డలు పొంగి పొర్లుతున్నాయి. పంట చేతికి వచ్చే సమయంలో తుఫానుతో వరిపంట నేలకొరిగి నష్టపోయామంటూ రైతులు తీవ్ర ఆవేదనను వ్యక్తం చేస్తున్నారు. మూడు రోజులుగా కురిసిన వర్షాలకు రెల్లిగెడ్డ ఉధృతంగా ప్రవహిస్తూ సమీప పొలాలను ముంచెత్తింది. లైదాం వద్ద వంతెన పైనుంచి రెల్లిగెడ్డ ప్రవహిస్తుండడంతో సంతకవిటి - పొందూరు మండలాల మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. వంతెన పైనుంచి ప్రయాణాలు జరగకుండా పోలీసులు చర్యలు చేపట్టారు. అలాగే పెనుబర్తి, బొడ్డేపల్లి వద్ద రైల్వే అండర్‌పాసేజ్‌లో నీరు నిలిచిపోవడంతో రాకపోకలు సాగించేందుకు వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. మండలంలోని పెనుబర్తి, అలమాజీపేట, తోలాపి, కింతలి, మొదలవలస, బొడ్డేపల్లి, తాడివలస, గోరింట, దల్లవలస, గోకర్ణపల్లి తదితర గ్రామాల్లో పలుచోట్ల వరిపంట నేలకొరగడంతో తీవ్ర నష్టం వాటిల్లిందంటూ రైతులు వాపోతున్నారు. నేలకొరిగిన వరిపంటను కట్టలు కట్టేందుకు రైతులు శ్రమించారు. తుపాను ప్రభావాన్ని ఎంపిడిఒ వాసుదేవరావు, తహశీల్దార్ వెంకటేష్‌తో పాటు మండలస్థాయి అధికారులు పరిశీలించారు.

తోలాపిలో పాఠశాలను ముంచెత్తిన వరదనీరు

మండలంలోని తోలాపి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణంలో గల చెరువులో భారీగా వరదనీరు చేరడంతో పాఠశాల చుట్టూ వరదనీరు ముంచెత్తింది. దీంతో పాఠశాల ఆవరణమంతా మునిగిపోవడంతో అధికారులు ఇంజన్లు సహాయంతో వరదనీరును బయటకు తరలిస్తున్నారు. అలాగే గ్రామంలోని పశువైద్య కేంద్రం చుట్టూ వరదనీరు చేరింది.

నేలకొరిగిన విద్యుత్ స్తంభాలు...

తుపానుతో మండలంలో సుమారు 23 విద్యుత్ స్తంభాలు నేలకొరిగినట్టు విద్యుత్ శాఖ ఎఇ సుధీర్ తెలిపారు. మండలంలోని వి.ఆర్.గూడెంలో మూడు, బురిడికంచరాంలో నాలుగు, లుట్టపేటలో నాలుగు స్తంభాలతో పాటు, మరికొన్ని గ్రామాల్లో స్తంభాలు పడిపోయాయి. లాగే పెనుబర్తి వద్ద ఆర్‌డిఎస్ఎస్ పరిధిలో ఐదు విద్యుత్ స్తంభాలు నేలకొరగగా, మూడు విద్యుత్ స్తంభాలు పక్కకు ఒరిగాయి.

మందస : మొంథా తుపాను ధాటికి మండలంలోని బేతాలపురం, రట్టి, లక్ష్మీపురం, వీరభద్ర, రంగనాథపురం గ్రామాల్లో జీడి, కొబ్బరి చెట్లు నేలకొరిగాయి. విషయం తెలుసుకున్న కూటమి నాయకులు భావన దుర్యోధన, దాసరి తాతారావు, లబ్బ రుద్రయ్య, బమ్మిడి కర్రయ్య, సాలిన మాధవరావు, ముడిమంచి నవీన్ కుమార్, అప్పాన ఈశ్వర రావు, సూరద వాసుదేవరావు, దున్న తిరుపతిరావు, జుత్తు అప్పల స్వామి, హరికృష్ణ, పులారి సుందర్రావు పరిశీలించారు.

వజ్రపుకొత్తూరు : మండలంలోని వజ్రపుకొత్తూరు-బెండి రోడ్డు పొలాలపై వచ్చే నీటితో జలమయమైంది. దీంతో వాహన చోదకులు ఇబ్బందులు పడ్డారు. డిటి మురళీకృష్ణ తన కారును అక్కడే నిలిపి నడుచుకుంటూ కార్యాలయానికి వెళ్లారు. మండలంలో అక్కుపల్లి, బైపల్లి, వజ్రపుకొత్తూరు, చినకొత్తూరు, హుకుంపేట, మంచినీళ్లపేట గ్రామాల్లో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాలకు ప్రజలు ఎవరు రాలేదని రెవెన్యూ అధికారులు తెలిపారు. గత మూడు రోజులుగా 44 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. దేవునల్తాడ, గోవిందపురం, బెండి పంచాయతీల్లో 27 ఎకరాలు వారి చేలు నేలమట్టమైంది. 467 ఎకరాల పంట మునిగిందని వ్యవసాయాధికారులు తెలిపారు.

పలాస : మండలంలోని కిష్టుపురం రైల్వే అండర్ పాసేజ్‌లోకి వరద నీరు వచ్చి చేరడంతో రాకపోకలు నిలిచిపోయాయి. బ్రాహ్మణతర్ల, కంబిరిగాం, కేదారిపురం, రాజగోపాలపురం, లక్ష్మీపురం, అమలకుడియా, పూర్ణభద్ర, బంటుకొత్తూరు, సున్నాడ తదితర ప్రాంతాల్లో వందలాది ఎకరాల్లో వరిపంట నీట మునిగింది. బ్రాహ్మణతర్ల, అల్లుకోల, పెదంచల, పలాస, కాశీ బుగ్గలో సాగుచేస్తున్న కూరగాయల పంటలు నాశనమయ్యాయి.

కవిటి: తుఫాన్ ప్రభావంతో కురిసిన భారీ వర్షాలతో ఖరీఫ్ రైతుకు అనుకోని నష్టం ఎదురైంది. మండలంలో చాలావరకు రైతుల వరి పంట నేలకొరగగా, మిగతా పంట నీటిలో ఉంది. బుధవారం క్షేత్రస్థాయిలో పర్యటించిన వ్యవసాయ అధికారులు మండలంలో 240 ఎకరాల్లో వరి పంట నీటిలో ఉన్నట్టు తెలిపారు. మరోవైపు ఇటు కపాసుకుద్ది నుంచి అటు మాణిక్య పురం వరకూ బీలలో నీరుచేరి పొగురు ఏర్పడింది. పరిస్థితులు అనుకూలించిన వెంటనే పొగురు తీయకపోతే పంటకు తీవ్ర నష్టం వాటిల్లుతుందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

నందిగాం : మండలంలోని ఉయ్యాలపేట, నారాయణపురం, కోమటిఊరు, నర్సిపురం, దిమిలాడ, నందిగాం, బెజ్జిపల్లి, పోలవరం గ్రామాల్లో వరి పైరు నేలమట్టమైంది. పొట్ట పాలు పోసుకునే దశలో ఉన్న వరి పైరుకు నేలకూరడంతో తీవ్రంగా నష్టం వాటిల్లుతుందని రైతులు కె.ధర్మారావు, రమేష్, బి.అప్పయ్య, పి.రమణమూర్తి, బి.జయరాం ఆందోళన వ్యక్తం చేశారు. మండలంలో సుమారుగా 10 వేల ఎకరాల్లో పంట దెబ్బతిందని సిపిఎం నాయకులు పాలిన సాంబమూర్తి తెలిపారు.

ఇళ్లల్లోకి నీరు

రణస్థలం: మండలంలోని మెంటాడ గ్రామం సరిహద్దులో ఉన్న పాదాల చెరువు భారీ వర్షాలకు నిండిపోవడంతో రజకులు నివసిస్తున్న పూరిళ్ల నీటితో మునిగిపోయాయి. విషయం తెలుసుకున్న తహశీల్దార్ సనపల కిరణ్ కుమార్ తక్షణమే స్పందించి ఆయా కుటుంబాలను దగ్గరలో ఉన్న పాఠశాలలోకి పంపించి పునరావాసం కల్పించి భోజనం ఏర్పాట్లు చేశారు. చెరువులోని నీరు బయటికి వెళ్లేలా ఇరిగేషన్ ఇంజినీర్ల సహాయంతో జెసిబి ఏర్పాటు చేసి నీరు బయటకు పంపించడంతో కొంత ఊరట లభించింది.


సోంపేట : పరిశీలిస్తున్న జెడ్‌పిటిసి యశోద

కొట్టుకుపోయిన కల్వర్టు

ప్రజాశక్తి- సోంపేట

మండలంలోని పలాసపురం నుంచి జాతీయ రహదారికి వెళ్లే రోడ్డు ఉన్నకల్వర్టు వరద ప్రవాహానికి మంగళవారం రాత్రి కొట్టుకుపోయింది. బుధవారం ఉదయం కొట్టుకుపోయిన కల్వర్టు ప్రదేశాన్ని స్థానిక జెడ్‌పిటిసి తడక యశోద, సర్పంచ్ జోగారావు పరిశీలించారు. అధికారులు స్పందించి తక్షణమే చర్యలు చేపట్టాలని వారు కోరారు. అలాగే సోంపేట బీల ప్రాంతంలో వర్షాలకు నీట మునిగిన వరి పంట పొలాలను పరిశీలించారు.

తుపానుతో అన్నదాతకు అవస్థలు

ప్రజాశక్తి- లావేరు

గతమూడు రోజులుగా మొంథా తుపాను ప్రభావంతో మండలంలో కురిసిన భారీ వర్షాలకు వరి, పత్తి, మొక్కజొన్న రైతులకు అవస్థలు, నష్టాన్ని మిగిల్చింది. ఆరుగాలం కష్టపడి పండించిన వరి పొట్టదశ గింజ కడుతున్న సమయంలో భారీ వర్షానికి వరి పంట పడిపోవడంతో ఎందుకు పనికి రాకుండా నీట పాలైంది. లావేరు, పేదలింగాలవలస, కొత్త కుంకాం, ఇజ్జుపేట, వెంకటాపురం, గోవిందపురం, ఆదపాక తదితర గ్రామాల్లో సుమారు 250 ఎకరాల్లో వరిపంట నేలవారి నీటిలో కుళ్లిపోయే దశకు వచ్చింది. అలాగే 300 ఎకరాలకు పైగా పత్తి పంట నీట మునిగి, గాలికి రాలిపోయింది. మరో 500 ఎకరాల్లో మొక్కజొన్న పంట కళ్లాల్లోనూ, రోడ్లపైన ఎండబెట్టి మొక్కజొన్న కండెలు తడిచిపోవడం, మొలకలు రావడం, రంగు మారిపోయి బూజు పట్టి పాడైపోయిందని, వ్యాపారులు కొనుగోలు చేయరని, ప్రభుత్వం నష్ట పరిహారం ఇచ్చి ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు. బుధవారం నష్టపోయిన పంటలను వ్యవసాయ సిబ్బంది పరిశీలించి నష్టపోయిన పంటల వివరాలను ప్రాథమిక నివేదికను తయారు చేస్తున్నారు. మండల వ్యవసాయధికారి డి.మహేష్ నాయుడు మాట్లాడుతూ పంటనష్టం వివరాలను గ్రామాల్లోని అగ్రికల్చర్ అసిస్టెంట్లు పొలాల్లో పరిశీలి స్తున్నారని, ఎక్కడెక్కడ ఏయే పంటలు ఎంతమేర నష్టం వాటిల్లిందో ప్రాథమికంగా పరిశీలిస్తున్నారని చెప్పారు.

పొంగి ప్రవహించిన బుడుమూరు పెద్దగెడ్డ

గత మూడు రోజులుగా తుఫాను ప్రభావంతో మండలంలోని బుడుమూరు పెద్దగెడ్డ పొంగిపొర్లుతుంది. దీని


లావేరు : నీట మునిగి పాడైన పత్తి పంట

ప్రభావంతో అదపాక, గుర్రాలపాలెం రహదారిపై రాకపోకలు నిలిచిపోయాయి. వరద నీటి ఉధృతికి రహదారి కోతకు గురై కొట్టుకుపోంది. తహశీల్దార్ శ్రీనువాసరావు, ఆర్‌అండ్‌బి జెఇ ఆంజనేయరాజులు దగ్గరుండి జెసిబితో తాత్కాలికంగా రహదారి మరమ్మతు పనులు చేయించారు. మండల కేంద్రంలోని వస్త్రపురికాలనీలో మంగళవారం రాత్రి ఉప్పు అప్పారావు, పాపాలు వృద్ధ దంపతుల పెంకుటిల్లు గోడ కూలి పోయింది. దీంతో వృద్ధులు భయంతో బైటకు వెళ్లిపోయారు. అదృష్టవశాత్తు గోడ బైటకు పడిపోవడంతో వీరు ప్రాణాలతో బయట పడ్డారు. వీరు చేనేత వృద్ధ కూలీలు. వీరిగోడ పడిపోవడంతో ఇరుగుపొరుగు వారి ఇళ్లలో తలదాచుకున్నారు. ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతున్నారు. చిగురు కొత్తపల్లిలో బావరాజు అప్పారావు ఇంటముందు పెద్దచెట్టు పడిపోయింది ఆ సమయంలో అక్కడ ఎవ్వరు లేకపోవడంతో ప్రమాదం తప్పింది. తహశీల్దార్ శ్రీనువాసరావు, ఎస్ఐ లక్ష్మణరావు అక్కడకు చేరుకుని పడిపోయిన చెట్టును దగ్గరుండి తొలగింపు పనులు పర్యవేక్షించారు.

జలమయమైన గ్రామాలు

ప్రజాశక్తి- శ్రీకాకుళం రూరల్

మండలంలోని తుఫాను ప్రభావంతో గ్రామాల్లో రోడ్లపైన వర్షపు నీరు నిల్వతో నిండి పోయాయి. ముఖ్యంగా డ్రైనేజీలు చెత్తతో నిండిపోయి ఉండడం వలన వర్షపునీరు పూర్తిస్థాయిలో రోడ్లపైనే నిలిచిపోవడంతో ప్రజలకు తీవ్ర అంతరాయం కలిగింది. ముఖ్యంగా పట్టణంలో విలీనమైన చాపురం, కిల్లిపాలెం, పెద్దపాడు, పాత్రునివలసకు ఆనుకుని ఉన్న కాలనీల్లో ఎక్కడ చూసినా వర్షపు నీరే కనిపిస్తుంది. ఒకటి రెండు చోట్ల ఈదురుగాలులకు పశువుల శాలలు కూలిపోయాయి. కొన్నిచోట్ల వరి పంట పొలాల్లో నీరు నిల్వ ఉండిపోయింది. అధికారులు స్పందించి గ్రామాల్లో ప్రజల కష్టాలు తీర్చాలని కోరుకుతున్నారు.

గార మండలంలో మెంథా తుపాను ప్రభావంతో నష్టపోయిన రైతులు, ప్రజలను వైసిపి యువనాయకులు ధర్మాన రామ్మనోహర్ నాయుడు పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తుఫాన్ ప్రభావం వలన నష్టపోయిన రైతులకు వెంటనే నష్టపరిహారం అందేలా చూడాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వెంటనే పంట నష్టాలను వ్యవసాయ అధికారులతో అంచనా వేయించాలని కోరారు. గ్రామాల్లో ఎక్కడ చూసినా రోడ్లపైన నీరుతో నిండిపోయాయని, ఇళ్లు కోల్పోయిన వారికి ప్రభుత్వం స్థలం కేటయించి ఇళ్లు నిర్మించాలన్నారు. ఆయనతో పాటు ఎంపిపి గొండు రఘురాం, వైసిపి మండల అధ్యక్షులు పీసా గోపి, యువజన అధ్యక్షులు మార్పు పృథ్వీ తదితరులు పాల్గొన్నారు.

ముంపు ప్రాంతాల్లో పర్యటన

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

మండలంలోని డొంకూరు, బూర్జపాడు, జగన్నాథపురం గ్రామాల్లోని మొంథా తుపాను ముంపు ప్రాంతాల్లో ప్రభుత్వ విప్ బెందాళం అశోక్ బుధవారం పరిశీలించారు. ఒడిశా రాష్ట్రం భగలోట్టి డ్యాం నుంచి వరద నీరు విడిచి పెట్టడంతో బాహుదాకి భారీగా వరద నీరు చేరిందని, దీంతో వందలాది ఎకరాలు వరి పంట ముంపునకు గురైందని వ్యవసాయాధికారులకు ఆయన దృష్టికి తీసుకెళ్తారు. డొంకూరులో నష్టపోయిన మత్స్య సంపద బాధితుల కలిసి జరిగిన నష్టం గురించి అడిగి తెలుసుకున్నారు. ఎక్కడా ప్రాణనష్టం లేకుండా అధికార యంత్రాంగం తీసుకున్న ముందుస్తు చర్యలను అభినందించారు. అరకభద్ర వంతన వద్ద గండిని పరిశీలించారు. పట్టణంలో బాలికోన్నత పాఠశాలలో ఉన్న జగన్నాథ పురం పునరావాసాన్ని పరిశీలించారు. వారికి రూ.3 వేలు ఆర్థిక సాయం ఆహార పదార్థాలను అందించారు. టిడిపి మండల అధ్యక్షులు లోపింటి పద్మనాభం, పిఎసిఎస్ అధ్యక్షులు పెద్దిన బాబ్జి, దక్కత కామేశ్వరరావు, దక్కత ఢిల్లీరావు, సహదేవ్‌రెడ్డి పాల్గొన్నారు.

జెడ్‌పి చైర్‌పర్సన్

మండలంలోని డొంకూరు, తులిసిగాం, జగన్నాథపురం, ఇన్నేసుపేట గ్రామాల్లో నీటి మునిగిన పంట పొలాలను జెడ్‌పి చైర్‌పర్సన్ పిరియా విజయ, ఎంపిపి బోరు పుష్ప, ఎంపిటిసి మరడ వలసయ్య, వైసిపి నాయకులు కాళ్ల నారాయణ, కాళ్ల మనోజ్, కాళ్ల దేవా పరిశీలించారు.

పోలాకి : నీటి మునిగి నష్టపోయిన పంట పొలాలకు ప్రభుత్వమే బాధ్యత వహిస్తుందని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి అన్నారు. మండలంలోని ప్రియాగ్రహారంలో నష్టపోయిన పంట పొలాలను అధికారులతో కలిసి పరిశీలించారు. కార్యక్రమంలో నియోజకవర్గ సమన్వయకర్త బగ్గు అర్చన, టిడిపి మండల అధ్యక్షులు మిరియాపల్లి వెంకటప్పలనాయుడు, పోలాకి పిఎసిఎస్ చైర్మన్ భైరి భాస్కరరావు, మాజీ సర్పంచ్ లావేటి కృష్ణ, ఎఒ చిరంజీవి పాల్గొన్నారు.

పలాస : రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని మాజీ మంత్రి సీదిరి అప్పలరాజు కోరారు. మండలంలోని సున్నాడ, శాసనం, రాజగోపాలపురం తుపాను ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించారు. నీట మునిగిన వరి పంటలు, కోతకు గురైన రోడ్లను పరిశీలించారు. శాసనం వద్ద జాతీయ రహదారి నుంచి రాజగోపాలపురం వరకు అధికారులు అనాలోచిత నిర్ణయాలు వల్ల రోడ్డు నిర్మాణంలో భాగంగా చిన్న గొట్టాలు వేయడం ద్వారా వందలాది ఎకరాలు నీట మునిగిందని ఆరోపించారు. ఆయనతో పాటు మాజీ ఎంపిపి బత్తిన హేమేశ్వరరావు, వైసిపి మండల అధ్యక్షుడు దువ్వాడ రవికుమార్, ఎంపిటిసి బమ్మిడి దుర్యోధన పాల్గొన్నారు.


ఇచ్ఛాపురం : పర్యటిస్తున్న ప్రభుత్వ విప్ అశోక్

అలాగే మండలంలోని కంబిరిగాం, బ్రహ్మణతర్ల, పెద్దబడాం, శివరాపురం ముంపు ప్రాంతాలను టిడిపి నియోజకవర్గ సమన్వయకర్త యార్లగడ్డ వెంకన్న చౌదరి, ఎపి ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ చైర్మన్ వజ్జ బాబూరావు పరిశీలించారు. కంబిరిగాం వరహాల గెడ్డలో దానగోరకు చెందిన సవర లావణ్య గల్లంతుపై అధికారులతో మాట్లాడారు. కార్యక్రమంలో టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి పి.విఠల్‌రావు, ఎఎంసి చైర్మన్ మల్లా శ్రీనివాసరావు, గాలి కృష్ణారావు, డొక్కరి శంకర్ పాల్గొన్నారు.

వజ్రపుకొత్తూరు : పూడిలంక గ్రామస్తులకు రహదారి కష్టాలు త్వరలో తీరుస్తానని పూడిజగన్నాథపురం మాజీ సర్పంచ్ తుమ్మల కృష్ణారావు హామీనిచ్చారు. టిడిపి నాయకులతో కలిసి నిర్మాణంలో ఉన్న పూడిలంక వంతెనను పరిశీలించారు. కార్యక్రమంలో సుళ్ల శాంతారావు, వంక రామారావు, నెయ్యిల సూర్యనారాయణ, మురిపించి పాపారావు, అరసవల్లి ఉమామహేశ్వరరావు, సైనీ బాలాజీ, రెవెన్యూ అధికారులు రాజు, రంగారావు పాల్గొన్నారు.

మెళియాపుట్టి : మండలంలోని పెద్దలక్ష్మీపురం, పెద్దపద్మాపురం, కోసమాల, రట్టిని, సంతోషపురం, గోకర్ణపురం, చాపర, గొప్పిలి, వసుంధర, మర్రిపాడు-కె గ్రామాల్లో తుపాను కారణంగా వరి పంట పొలాలు నీట మునిగాయి.

బూర్జ: అన్నదాతకు అండగా ఉంటామని, ఆందోళన పడవద్దని ఎమ్మెల్యే కూన రవికుమార్ రైతులకు భరోసా కల్పించారు. మండలంలోని పెద్దపేటలో వరిపంటను పరిశీలించారు. అయితే రైతులను ఆదుకునేందుకు సిఎం చంద్రబాబు అనుక్షణం కృషి చేస్తున్నారన్నారు. కూటమి ప్రభుత్వంలో ఏ ఒక్క రైతు కూడా నష్టపోయే పరిస్థితి ఉండదని స్పష్టం చేశారు. నీట మునిగి పంటలు నష్టపోయిన రైతులను ప్రభుత్వం బాధ్యత వహిస్తూ ఆదుకుంటుందని హామీఇచ్చారు. ఈయనతో మార్క్‌ఫెడ్ డైరెక్టర్ ఆనెపు రామకృష్ణ, కడగల కృష్ణ, దోబ బాలకృష్ణ, మామిడి దుర్గా రావు, ఎంపిటిసి చొక్కర పోలినాయుడు, ఎంపిడిఒ తిరుపతి రావు, ఎఒ ఉషారాణి, తహశీల్దార్ వై.వి పద్మావతి, రైతులు పాల్గొన్నారు.

తుపాను బాధితులకు పరిహారం అందజేత

ప్రజాశక్తి- కొత్తూరు

మొంథా తుపాను ప్రభావంతో ప్రభావంతో మూడు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు మండలంలోని రామకృష్ణాపురం గ్రామస్తులను ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాల పునరావాసానికి తరలించారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే మామిడి గోవిందరావు, ఆర్‌డిఒ ఎం.కృష్ణమూర్తి పునరావాస కేంద్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా బాధితులకు రూ.3 వేలు నగదు, నిత్యావసర సరుకులను అందజేశారు. తుపాను ప్రభావంఉన్నంత వరకూ పునరావాస కేంద్రాన్ని కొనసాగించాలన్నారు. వారికి కావాల్సిన సదుపాయాలను కల్పించాలని మండలస్థాయి అధికారులకు ఆదేశించారు. కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి అన్నదొర, ఎంపిడిఒ బి.వి.ఆర్.ప్రసాదరావు, తహశీల్దార్ కె.బాలకృష్ణ, సిఐ చింతాడ ప్రసాద్, టిడిపి మండల కన్వీనర్ అగతముడి మాధవరావు, పిఎసిఎస్ మాజీ అధ్యక్షులు అగతముడి అరుణ్‌కుమార్ పాల్గొన్నారు.

మెళియాపుట్టి : మండలంలోని పెద్దలక్ష్మీపురం, గోపీనాథపురం పునరావాస కేంద్రాలను పిఎసిఎస్ అధ్యక్షులు సలాన మోహనరావు, గౌడ్ కార్పొరేషన్ డైరెక్టర్ భాస్కర్‌గౌడ, టిడిపి మండల అధ్యక్షులు నంబాల వెంకటరావు పరిశీలించారు. ఈ సందర్భంగా ఒక్కొక్క బాధిత కుటుంబానికి రూ.3 వేలు చొప్పున నగదు, నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దార్ కె.రాము, సీనియర్ అసిస్టెంట్ జగన్మోహనరావు, బూర్ల లలిత కుమారి, కదంబల పైడిరాజు, ఇప్పిలి కృష్ణారావు, కార్యదర్శి వాసుదేవరావు, విఆర్ఒ సత్యనారాయణ పాల్గొన్నారు.

ఆమదాలవలస: మొంథా తుపానుపై సిఎం చంద్రబాబు ముందుదస్తుగా తీసుకున్న చర్యలు అమోఘమని ఎమ్మెల్యే కూన రవికుమార్ అన్నారు. బుధవారం సరుబుజ్జిలి మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉన్న శ్రీరామవలస తుపాను బాధితులకు ప్రభుత్వం అందించిన ఆర్థికసాయాన్ని ఎమ్మెల్యే అందజేశారు. శ్రీరామవలస ప్రాంతంలో ఉన్న 18 కుటుంబాలు తుపాను రెండవ రోజు మంగళవారం వర్షం, ఈదురు గాలులతో పూరి గుడిసెల్లో నివసిస్తున్న ఎరుకుల కుటుంబాలు ప్రమాదకర పరిస్థితిలో ఉండటం గమనించిన వీరిని తహశీల్దార్ ఎల్.మధుసూదన్ సరుబుజ్జిలి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పునరావస కేంద్రం ఏర్పాటు చేసి ఆదుకోవడం ప్రశంసనీయమని ఎమ్మెల్యే రవికుమార్ అన్నారు. అనంతరం ఎమ్మెల్యే సరుబుజ్జిలి, శరభాపురం, తురకపేట రెవెన్యూ గ్రామాల పరిధిలో ఉన్న వరిపంట పొలాలను అధికారులతో కలిసి పరిశీలించారు. తుఫాను ప్రభావంతో ఎటువంటి నష్టాలు ఏర్పడ్డాయో గుర్తించి తక్షణమే నివేదికలు రూపొందించి ప్రతిపాదనలు పంపించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపిడిఒ ఎం.పావని, ఎఒ మన్మధరావు, మండల తెలుగు యువత అధ్యక్షులు దవల సింహాచలం, ఎస్‌సి సెల్ అధ్యక్షులు ఇల్లాకుల ప్రభాకర్, కొమనాపల్లి రవికుమార్, కొర్ను సూర్యనారాయణ పాల్గొన్నారు.


కొత్తూరు : సరుకులు అందజేస్తున్న ఎమ్మెల్యే గోవిందరావు

సంతబొమ్మాళి : మండలంలోని నౌపడ పంచాయతీ సీతానగరం తుపాను పునరావాస కేంద్రంలో టిడిపి నాయకులు సుగ్గు శాంతి స్వరూపరెడ్డి, వాడరేవు కృష్ణారావు ఆర్థికసాయం అందించారు.


ప్రశ్నిస్తున్న కౌన్సిలర్ సూర్యనారాయణ (ఇన్‌సెట్‌లో మాట్లాడుతున్న చైర్మన్ గిరిబాబు)

టెండర్లు ఎందుకు పిలవడం లేదు?

ప్రజాశక్తి- పలాస

మున్సిపాలిటీలో అభివృద్ధి చేపట్టేందుకు సుమారు 32 పనులకు సిఆర్ చేసి టెండర్లుకు ఎందుకు పిలవడం లేదని కౌన్సిలర్ గురిటి సూర్యనారాయణ అధికారులను ప్రశ్నించారు. పలాస-కాశీబుగ్గ మున్సిపల్ కార్యాలయంలో చైర్మన్ బల్ల గిరిబాబు అధ్యక్షతన బుధవారం సాధారణ కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. కౌన్సిలర్ పదవి కాలం దగ్గర పడుతుందని, త్వరగా అభివృద్ధి పనులు జరిగేలా చూడాలని అధికారులను విన్నవించారు. దీనిపై చైర్మన్ మాట్లాడుతూ మున్సిపాలిటీలో జనరల్ ఫండ్ తక్కువగా ఉందన్నారు. మరో రెండు రోజుల్లో టెండర్లు పిలుస్తామని చెప్పారు. నిధులు సర్దుబాటు చేస్తూ పనులు చేపడతామని తెలిపారు. పలాస మోర్, కాశీబుగ్గ చైతన్య కళాశాల ప్రాంతాల్లో వర్షం కురిస్తే మురుగు నీరు రోడ్లపై నుంచి ప్రవహిస్తుందని, త్వరితగతిన నిల్వ లేకుండా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. కౌన్సిలర్ జోగారావు మాట్లాడుతూ 15వ ఆర్థికసాయం నిధులు అన్ని వార్డులకు సమానంగా ఖర్చు చేయడం లేదని, కాశీబుగ్గ మేదర వీధి వద్ద కాలువ పనులు చేపట్టాలని ప్రతిసమావేశంలోనూ చెబుతున్నా ఎందుకు పనులు చేపట్టడం లేదని ప్రశ్నించారు. కాశీబుగ్గ మూడు రోడ్ల కూడలి నుంచి రైల్వే గేటు వరకు ఆ ప్రాంతం మురుగు కాలువ నీరు రోడ్లపై ప్రవహిస్తుందని, ప్రయాణికులు, వాహన చోదకులు, ప్రజలు నిరంతరం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వైస్ చైర్మన్ మీసాల సురేష్‌బాబు మాట్లాడుతూ అంబుసోలిలో తాగునీటి పైపులైన్ పాడైందని, ఎందుకు మరమ్మతులు చేపట్టడం లేదని ప్రశ్నించారు. కౌన్సిలర్ కర్రి మాధవరావు మాట్లాడుతూ తాళభద్ర ప్రాంతంలో వీధి దీపాలు వెలిగించడం లేదని సభ దృష్టికి తీసుకొచ్చారు. సమావేశంలో మున్సిపల్ డిఇ కనకరాజు, ఎఇ కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.

వ్యక్తి ఆత్మహత్య


ఇబ్రహీం

ప్రజాశక్తి- శ్రీకాకుళం సిటీ

ఉత్తరప్రదేశ్ రాష్ట్రానికి చెందిన ఇబ్రహీం (21) గత కొంత కాలంగా పట్టణంలో ఒక సెలూన్ సెంటర్‌లో పనిచేస్తూ జీవిస్తున్నాడు. పట్టణంలో మేడపై గదిలో అద్దెకు ఉంటున్న ఈ వ్యక్తి ఫ్యాన్ హుక్‌కు బుధవారం ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఇంటి యజమాని గుర్తించి పోలీసులకు సమాచారం ఇవ్వగా, మృతదేహాన్ని రిమ్స్‌కు పోస్టుమార్టం కోసం తరలించారు. ఉత్తరప్రదేశ్‌లోని బంధువులకు సమాచారం అందజేశారు. కుటుంబ కలహాల నేపథ్యంలో ఆత్మహత్యకు పాల్పడినట్లు సమాచారం. మొదటి పట్టణ ఎస్ఐ జగన్నాధరావు కేసుదర్యాప్తు చేస్తున్నారు.

ఒడ్డుకు చేరిన మృతదేహం

శ్రీకాకుళం సిటీ : గత ఆదివారం రాత్రి డే అండ్ నైట్ కూడలిలో నాగావళి నదిలో దువ్వు రాజ్యలక్ష్మి అనే మహిళ దూకింది. ఈమె మృతదేహం శ్రీకాకుళం రూరల్ మండలం గనగళ్లపేటలో సముద్రం ఒడ్డుకు చేరింది. రెండువ పట్టణ పోలీస్‌స్టేషన్‌లో అదృశ్యం కేసును నమోదు చేశారు. గత రెండు రోజులుగా ఎన్‌డిఆర్‌ఎఫ్ బృందాలు మృతదేహం కోసం గాలిస్తున్నాయి.

తెప్పోత్సవానికి ఏర్పాట్లు

అరసవల్లి: 2న చిలుక ద్వాదశి సందర్భంగా అరసవల్లి శ్రీ సూర్యనారాయణ స్వామి వారి ఇంద్ర పుష్కరిణిలో నిర్వహించనున్న తెప్పోత్సవం కార్యక్రమానికి, హంస తూలిక వాహన రూపంతో ఉన్న తెప్పను తయారు చేసి ఏర్పాట్లు చేస్తున్నారు. సాయంత్రం 4 గంటల నుంచి 7 గంటల వరకు తెప్పోత్సవం నిర్వహించనున్నట్లు ఆలయ ఇఒ కెఎన్‌విడివి ప్రసాద్ తెలిపారు. పగడ్బం దీగా క్యూలైన్లు ఏర్పాటు, ఎటువంటి అవాంఛనీయ సంఘటన జరగకుండా ఈతగాళ్ళను కూడా ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు.


పొందూరు : మృతుల కుటుంబాలను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే రవికుమార్

మృతుల కుటుంబాలకు పరామర్శ

పొందూరు: మండలంలోని కింతలిలో ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన పలువురి కుటుంబసభ్యులను బుధవారం ఎమ్మెల్యే కూన రవికుమార్ పరామర్శించారు. గ్రామంలోని పొన్నాడ సత్యం, పైడి వసంత కుమార్, పైడి శశిభూషణరావు, సింగూరు లక్ష్మీనారాయణమ్మ కుటుంబాలను ఆయన పరామర్శించారు. ఈయనతో పాటు ఎంపిటిసి కూటికుప్పల హను మంతురావు, మాజీ సర్పంచ్ దవళ గణపతిరావు, మండల మహిళా సమాఖ్య అధ్యక్షులు పైడి అరుణ, టిడిపి నాయకులు కిల్లి రామారావు, కూటికుప్పల శ్రీను, రాజారావు, రమణ, రంగనాథం, రామారావు తదితరులున్నారు.

బూర్జ: మండలంలోని పలు గ్రామాల్లో ఇటీవల మృతి చెందిన వ్యక్తుల కుటుంబాలను ఆముదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్ పరామర్శించారు. మండలంలోని పాలవలసలో అలుబోయిన అప్పలనాయుడు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. అలాగే గ్రామానికి చెందిన పార్వతమ్మ, కొండపేట గ్రామానికి చెందిన పాలక శంకరయ్య, కె.కె.రాజపురం గ్రామానికి చెందిన కంట దాలయ్య, కొల్లివలస మాజీ సర్పంచ్ సవిరిగాన సిమ్మన్నలు ఇటీవల మృతి చెందడంతో ఆయా గ్రామాలకు వెళ్లి మృతుల కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే పరామర్శించారు. ఆయనతో పాటు మార్క్‌ఫెడ్ డైరెక్టర్ ఆనెపు రామకృష్ణ, సవిరిగాన ఆనందరావు, దుర్గారావు, కంట కృష్ణ, సర్పంచ్ సీతారామరాజు, డి.శ్రీనివాసరావు, పాలక శ్రీరాములు తదితరులున్నారు.

సహాయక చర్యల్లో అధికారులు

ప్రజాశక్తి- కంచిలి

తుపాను నేపథ్యంలో రెండు రోజులుగా కురిసిన వర్షాలకు పలుచోట్ల ఇళ్ల గోడలు కూలిపోవడమే కాకుండా, రహదారులపై కల్వర్టులకు గండ్లు పడి, రహదారులు కొట్టుకుపోయి వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. అలాగే కొన్ని చోట్ల విద్యుత్ స్తంభాలు నేల కూలడంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది. బుధవారం మధ్యాహ్నానికి వర్షం తగ్గుముఖం పట్టడంతో అధికారులు సహాయక చర్యలపై దృష్టి సారించారు. ఎంపిడిఒ వి.తిరుమలరావు, డిప్యూటీ ఎంపిడిఒ వీరభద్రస్వామి, ఎస్ఐ పారినాయుడు, ఎపిఒ ధనంజయం వరద ప్రభావిత గ్రామాలైన నారాయణబట్టి, కేసరిపడ, అర్జునపురం, బాలగోవిందపురం గ్రామాల్లో పర్యటించి జరిగిన నష్టాలను నమోదు చేసుకున్నారు. ఎఒ కె.సురేష్ కేసరిపడ, ఎం.ఎస్.పల్లి, కొల్లూరు, ముండల ప్రాంతాల్లో నీట మునిగిన పంట పొలాలను పరిశీలించి పంట సంరక్షణకు రైతులకు తగిన సూచనలు అందజేశారు. డి.జి.పురం సమీపంలో కల్వర్టుకు గండిపడడంతో రహదారిపై రాకపోకలు నిలుపుదల చేసి, నూతనంగా నిర్మించిన కల్వర్టును సిద్ధం చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు ఆర్‌అండ్‌బి ఎఇఇ విక్రమ్ తెలిపారు. వర్షాల కారణంగా సాలిన పుట్టుగలో సాలిన ఢిల్లీరావుకి చెందిన ఇంటి గోడ కూలిపోయింది. అలాగే పద్మతుల గ్రామంలో ఉయ్యూరు దానమ్మకి చెందిన ఇంటిగోడ కూలిపోయింది. సంఘటన స్థలాలకు స్థానిక రెవెన్యూ అధికారులతో టిడిపి మండల అధ్యక్షుడు మాదిన రామారావు పరిశీలించారు. కంచిలి వైపు నుంచి కేసరిపడ మీదుగా కేబినౌగాం వెళ్తున్న ఆర్‌టిసి బస్సు అర్జునపురం వద్ద వరద నీటిలో ఇరుక్కుపోయింది. ప్రయాణికులను దించివేసి ట్రాక్టర్ సాయంతో గ్రామస్తులు బస్సులు వరద నీటి నుంచి బయటకు తీశారు.


సాలినపుట్టుగలో కూలిన ఇంటి గోడ

అధ్వానంగా రోడ్లు.. ప్రయాణికుల పాట్లు

- గుంతలతో దారుణంగా రహదారులు
- వర్షమొస్తే చెరువును తలపిస్తున్న వైనం
- ఇబ్బందుల్లో ప్రజలు
- పట్టించుకోని అధికారులు

ప్రజాశక్తి- రణస్థలం

మండలంలోని పలు గ్రామాల్లో రోడ్లు అధ్వానంగా ఉండడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రోడ్లపై గుంతలతో నానా అవస్థలు పడుతున్నారు. చిన్నపాటి వర్షం కురిసినా ఆ గుంతల్లో నీరు నిలవడంతో వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. సీతారాంపురం నుంచి మీసాలపేట మీదుగా పాతర్లపల్లి వెళ్లే రోడ్డు పెద్దపెద్ద గుంతలతో అధ్వానంగా తయారైంది. వర్షం కురిసినప్పుడు ఆ గుంతల్లో వర్షపునీరు చేరడంతో వాహనాలు వెళ్లలేని పరిస్థితి నెలకొంటుంది. అదేవిధంగా ప్రజలు కూడా నడిచి వెళ్లలేని పరిస్థితిగా రోడ్డు తయారైంది. రోడ్లపై ఉన్న గుంతలను కనీసం పూడ్చకపోవడంతో వర్షం కురిసినప్పుడు ప్రయాణికులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గుంతలు పూడ్చకపోవడం, మార్జిన్లు పెంచకపోవడవంతో ప్రయాణం నరకప్రాయంగా ఉందని రోడ్డులో ప్రయాణించే వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కనీసం రోడ్లపై గుంతలు కూడా పూడ్చకపోవడంతో వాహనదారులు ప్రమాదాలకు గురై గాయపడిన సంఘటనలు ఉన్నాయి. ఈరోడ్డుపై ప్రయాణం చేస్తే వాహనాలు కూడా ఆరు మాసాలకే మరమ్మతులకు గురై మూలకు చేరుతున్నాయని వాహనదారులు గగ్గోలు పెడుతున్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి కనీసం గుంతలైనా పూడ్చాల్సిన బాధ్యత లేదా అని ప్రశ్నిస్తున్నారు. అధికారులు కనీసం గుంతలను కూడా పూడ్చలేదు. ఏ ప్రమాదం జరుగుతుందోనని భయాంతోనే రోడ్లపై ప్రయాణిస్తున్నాం. రోడ్లకు మరమ్మతులు చేసేలా ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు, చర్యలు తీసుకోవాలని ఆయా గ్రామాలకు చెందిన ప్రజలు ముక్తకంఠంతో కోరుతున్నారు.


మీసాలపేట నుంచి పాతర్లపల్లి వెళ్లే రహదారి

మురుగునీటితో కాలనీవాసుల అవస్థలు

ప్రజాశక్తి- సరుబుజ్జిలి

మండలంలోని రొట్టవలసలో అలికాం - బత్తిలి ప్రధాన రహదారి పక్కనే ఉన్న ఎస్‌సి, బిసి కాలనీల్లోని సిసి రహదారులపై మురుగునీరు నిల్వ ఉండడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కొద్దిపాటి వర్షం పడినా మోకాళ్ల లోతు వరకు నీరు నిల్వ ఉండడంతో నిత్యజీవితంలో తీవ్ర కష్టాలు పడుతున్నామని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రధాన రహదారి సహా కాలనీల్లోని వీధుల్లోని కాలువల్లో కొన్ని రోజులుగా శుభ్రం చేయకపోవడంతో పూడికలు పేరుకుని నీరు సరిగా వెళ్లక దోమల పెరుగుదల అధికమై వ్యాధులు వ్యాప్తి చెందుతున్నాయని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మొంథా తుపాను ప్రభావంతో ఇప్పటికే రెండు రోజులుగా విస్తారంగా కురుస్తున్న వర్షాలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న నేపథ్యంలో సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఎవరూ పట్టించు కోవడం లేదని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. పాలకులు, అధికారులు నిర్లక్ష్య వైఖరిని గుర్తించి ఉన్నతాధికారులు తక్షణ చర్యలు తీసుకుని మురుగునీటి సమస్యను పరిష్కరించాలని కాలనీ వాసులు కోరుతున్నారు.


బిసి కాలనీలో నిలిచిన వర్షపునీరు

ఆఖరి మజిలీలోనూ అవస్థలే

లావేరు: మనిషి ఆఖరి మజిలీలోను ఆ గ్రామంలో అవస్థలు తప్పడం లేదు. మండలంలోని కొత్తకుంకాం పంచాయతీ కొండ కుంకాంలో దేవర పాపయ్య (75) బుధవారం మృతి చెందగా అంత్యక్రియలు చేసేందుకు శ్మశానానికి తీసుకువెళ్లేందుకు ఆ గ్రామస్తులు, కుటుంబీకులు నరకం చూశారు. అంత్యక్రియలు చేయడానికి శ్మశానానికి తీసుకు వెళ్లేందుకు దారిలేక పోవడంతో పంటపొలాల్లో నుంచి మోకాల్లోతు నీటిలో గట్లుపై బురదలో జారిపోతూ అతికష్టం మీద మోసుకెళ్లారు. 500 మంది జనాభా ఉన్న గ్రామంలో ఇటువంటి బాధలు తప్పడం లేదని, శ్మశానవాటికకు రోడ్డు, బోరు, షెడ్ ఏర్పాటు చేయాలని ప్రజాప్రతినిధులు, అధికారులను గ్రామస్తులు వేడుకుంటున్నారు.


పంట పొలాల్లో నుంచి మృతదేహాన్ని మోసుకువెళ్తున్న గ్రామస్తులు

బాధిత రైతులకు న్యాయం చేస్తాం

ప్రభుత్వ విప్ అశోక్

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

మొంథా తుపాను ప్రభావంతో మండలంలోని ముంపునకు గురైన బాధిత రైతులకు ప్రభుత్వం తరుపున అన్ని విధాలా న్యాయం చేస్తామని ప్రభుత్వ విప్ బెందాళం అశోక్ అన్నారు. స్థానిక రెవెన్యు కార్యాలయం ప్రత్యేక అధికారి శ్రీనివాస్‌రెడ్డి అధ్యక్షతన వివిధ శాఖల అధికారులతో వరద నష్టాలు, పునరావాస చర్యలపై బుధవారం సమావేశం నిర్వహించారు. వ్యవసాయశాఖ ఎడిఇ భవానీశంకర్ మాట్లాడుతూ మండలంలో భారీగా కురిసిన వర్షాలు, బాహుదా నది వరద ఉధృతి వల్ల సుమారు 2500 ఎకరాలు వరి పంట ముంపునకు గురైందన్నారు. ఇంకా పంట పొలాల్లో నీరు ఉండడం వల్ల ఇప్పుడే పంట నష్టాలపై స్పష్టమైన అభిప్రాయానికి రాలేదని తెలిపారు. నీరు తగ్గు ముఖం పట్టిన తర్వాత వాస్తవ పరిస్థితి తెలుస్తుందని అన్నారు. ముంపు పొలాలు పరిస్థితి అంచనా వేయడానికి వ్యవసాయ శాస్త్రవేత్తలు డాక్టర్ ఉదయబాబు, భాగ్యలక్ష్మి వచ్చారని అన్నారు. క్షేత్రస్థాయిలో పర్యటించి పంట పొలాలు పరిస్థితి అంచనా వేశాస్తామని తెలిపారు. రైతులను అన్ని విధాలుగా న్యాయం చేయడానికి కృషి చేస్తామని స్పష్టం చేశారు. వరద ప్రాంతాలతో పాటు అన్ని గ్రామాల్లో వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని వైద్య సిబ్బందికి విప్ ఆదేశించారు. ప్రతి పంచాయతీల్నోఉ పారిశుధ్య పనులు చేపట్టి బ్లీచింగ్ జల్లించాలన్నారు.



సమీక్షిస్తున్న విప్ అశోక్

ఇసుక తవ్వకాలపై కొరడా

బాహుదా నదిలో అక్రమ ఇసుక తవ్వకాలపై కఠిన చర్యలు తీసుకోవాలని పోలీస్, రెవెన్యూ అధికారులకు విప్ ఆదేశించారు. ఇసుక తవ్వకాలు, అక్రమ వ్యాపార లావాదేవీలపై అధికార యంత్రాంగం కఠినంగా వ్యవహరించాలన్నారు. ఇప్పటికే బాహుదా నదిలో అమాంతంగా ఇసుకు దోపిడీకి గురైందన్నారు. దీనివల్ల భవిష్యత్‌లో తాగునీటికి ఇబ్బందులు తప్పవన్నారు. బాహుదా నదిలో ఛానల్‌ను అభివృద్ధి చేసేందుకు రూ.కోట్లు నిధులు తెచ్చినా బాహుదా నదిలో ప్రస్తుతం నెలకొన్న పరిస్థితి వల్ల ప్రయోజనం లేకుండా పోతుందని అన్నారు. ముందు అక్రమ ఇసుక తవ్వకాలు, అక్రమ వ్యాపార లావాదేవీలపై అధికార యంత్రాంగం దృష్టిసారించాలన్నారు. అరకభద్ర వంతన వద్ద గండి పడిందని, ఇంజినీరింగ్ అధికారి సమీక్షకు గైర్హాజరుపై మండిపడ్డారు. వెంటనే అరకభద్ర వంతన పరిస్థితిపై తీసుకుంటున్న చర్యలు తనకు చెప్పాలని సూచించారు. కార్యక్రమంలో జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి దాసరి రాజు, తహశీల్దార్ వెంకటరావు, ఎంపిడిఒ ప్రభాకరరావు, ఇరిగేషన్ ఎఇ పాణిగ్రహి, మున్సిపల్ కమిషనర్ రమేష్ పాల్గొన్నారు.

పిపిపిని వ్యతిరేకించాలి

నరసన్నపేట: ప్రభుత్వ మెడికల్ కాలేజీలు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా వైసిపి నాయకులు, ప్రజలు స్వచ్ఛందంగా కోటి సంతకాల సేకరణ కార్యక్రమంలో పాల్గొని కూటమి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని తిప్పికొట్టాలని పోలాకి జెడ్‌పిటిసి ధర్మాన కృష్ణచైతన్య కోరారు. మండలంలోని మాకివలసలో బుధవారం రచ్చబండ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇంటింటికీ వెళ్లి రేషన్ ఇచ్చే పథకం ఆపేసి మందు ఇచ్చే పథకాన్ని సిఎం చంద్రబాబు ప్రారంభించారని ఎద్దేవా చేశారు. వచ్చే ఎన్నికల్లో ప్రజలు తగిన బుద్ధి చెపుతారని అన్నారు. కార్యక్రమంలో ఎంపిపి ఆరంగి మురళిధర్, జెడ్‌పిటిసి చింతు రామారావు, రాష్ట్ర పొందర కూరకుల విభాగం అధ్యక్షులు రాజపు అప్పన్న, వైసిపి మండల అధ్యక్షులు లుకలాపు రవి పాల్గొన్నారు.

నేడు రచ్చబండ

పొందూరు: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం చేస్తున్న మెడికల్ కళాశాలల ప్రవేటీకరణ వ్యతిరేకిస్తూ వైసిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి చింతాడ రవికుమార్ ఆధ్వర్యంలో గురువారం రచ్చబండ కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు వైసిపి మండల అధ్యక్షుడు కొంచాడ రమణమూర్తి తెలిపారు. మండలంలోని తుంగపేట, లైదాం, కొంచాడ, రాపాక గ్రామాల్లో నిర్వహించనున్నట్లు తెలిపారు. రచ్చబండ కార్యక్రమానికి వైసిపి నాయకులు, కార్యకర్తలు, హాజరై విజయవంతం చేయాలని కోరారు.

మత్స్యకార గ్రామాల్లో పర్యటన

ప్రజాశక్తి- రణస్థలం

మండలంలోని పలు మత్స్యకార గ్రామాల్లో విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పల నాయుడు, ఎమ్మెల్యే నడికుదుటి ఈశ్వరరావు, మండల నాయకులు, అధికారులతో కలిసి బుధవారం పర్యటించారు. మొంథా తుపాను కారణంగా సముద్ర అలలదాటికి మత్స్యకారుల సౌలభ్యం కొరకు సముద్ర తీరంలో ఏర్పాటు చేసిన సిమెంట్ ప్లాట్ఫార్మ్ శిధిలమై సముద్రంలో కొట్టుకుపోయి, అలాగే సముద్ర తీరం కూడా అలలుదాటికి కోతకు గురవడంతో జరిగిన నష్టాన్ని పునరుద్ధీకరించే చర్యల్లో భాగంగా అధికారులతో కలిసి నష్టాన్ని, ప్రభావిత ప్రాంతాలను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మత్స్యకారులకు ప్రభుత్వం ఎప్పుడూ అండగా ఉంటుందని, అన్ని విధాలుగా ఆదుకునేందుకు సిఎం చంద్రబాబు నాయుడు ముందుంటారన్నారు.



మత్స్యకార గ్రామాల్లో పర్యటిస్తున్న ఎంపీ, ఎమ్మెల్యే

డ్రైనేజీ పనులు పరిశీలన

ప్రజాశక్తి- మెళియాపుట్టి

మండలం లోని కోసమాలలో పైలట్ ప్రాజెక్టు కింద రెండు మ్యాజిక్ డ్రైనేజీలను నిర్మిస్తున్నామని ఎంపిడిఒ నరసింహ ప్రసాద్ పండా తెలిపారు. ఈ మేరకు డ్రైనేజీ పనులను బుధ వారం పరిశీలించారు. రూ.90 వేలు, రూ.80 వేలుతో ఈ మ్యాజిక్ డ్రైనేజీలను నిర్మిస్తున్నామని అన్నారు. గ్రామంలో డ్రైనేజ్ వ్యవస్థను మెరుగుపరచడమే కాకుండా పారిశుధ్య పరిస్థితులను బలోపేతం చేయడంలో ఈ మ్యాజిక్ డ్రైనేజీలు కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు. ఈ ప్రాజెక్టు విజయవంతమైతే, మరిన్ని గ్రామాలకు విస్తరించే అవకాశం ఉందని పేర్కొన్నారు. కార్యక్రమంలో పంచాయతీరాజ్ ఎఇ ఆనందరావు, ఎపిఒ టి.రవి, విసి ఆదినారాయణరెడ్డి, టిడిపి మండల ప్రధాన కార్యదర్శి బొచ్చు ప్రసాదరావు పాల్గొన్నారు.



పనులను పరిశీలిస్తున్న అధికారులు

జాగ్రత్తలు పాటించి పంటను కాపాడుకోవాలి



రణస్థలం రూరల్ : పొలాలను పరిశీలిస్తున్న శాస్త్రవేత్త, వ్యవసాయాధికారులు

ప్రజాశక్తి- పలాస

మొంథా తుపాను కారణంగా వరి పంట నీట మునిగిందని, రైతులు జాగ్రత్తలు పాటించి పంటను కాపాడుకోవాలని రాగోలు వ్యవసాయ పరిశోధనా కేంద్రం శాస్త్రవేత్త ఎం.శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని సున్నాడ, శాసనాం, రాజగోపాలపురం, రెంటికోట, అల్లుకోల తదితర ప్రాంతాల్లో బుధవారం రైతులు, వ్యవసాయ శాఖ అధికారులతో కలిసి ముంపునకు గురైన పంట పొలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంపత్ స్వర్ణ, 1061, 1064 వరి పొలాలు పూత దశ నుంచి పాలు పోసుకొనే దశలో ఉన్నాయని చెప్పారు. రెండు రోజుల వరకు పంట పొలాల్లో నీరు నిల్వ ఉన్న ఎటువంటి ఇబ్బంది ఉండదన్నారు. త్వరగా పొలంలో ఉన్న వరద నీటిని బయటకు మళ్లించాలని సూచించారు. ఎకరా పొలంకు ప్రాపోకొనజాల్ 200 ఎంఎల్ నీటిలో కలిపి పంటపై పిచికారీ చేయాలన్నారు. పిచికారీ చేయడం ద్వారా గింజలు నలుపు రాకుండా ఉంటుందన్నారు. అలాగే ఎకరా పొలంలో 25 కేజీలు పొటాష్, 10 నుంచి 15 కేజీలు వరకు యూరియా కలిపి పంట పొలంలో చల్లాలన్నారు. వరద నీరు పూర్తిగా తగ్గిన తర్వాత పంట ఎంత శాతం వరకు నష్టం వాటిల్లిందనే విషయాన్ని గుర్తిస్తామని చెప్పారు. కార్యక్రమంలో పలాస వ్యవసాయ శాఖ అదనపు సంచాలకులు రామారావు, ఎఒ పోలారావు, రైతులు పాల్గొన్నారు.

నందిగాం : మండలంలోని రాంపురంచ చిన్నలక్ష్మీపురం, పెద్దతామరపల్లి, కోమటూరు, కర్లపూడి ముంపునకు గురైన వరి పంటను టెక్కలి వ్యవసాయ సహాయ సంచాలకులు కె.రామ్మోహనరావు, వ్యవసాయ శాస్త్రవేత్త కె.మధుకుమార్, ఎఒ పి.శ్రీకాంత్‌వర్మలు పరిశీలించారు.

సోంపేట : వర్షాలకు నీట మునిగిన సోంపేట సమీపంలోని బీల ప్రాంతంలో గల వరి పంట పొలాలను రాగోలు పరిశోధన శాస్త్రవేత్త డాక్టర్ ఉదయ్ కుమార్, విశ్వవిజ్ఞాన కేంద్రం అధిపతి భాగ్యలక్ష్మి, స్థానిక సోంపేట సహా వ్యవసాయ సంచాలకులు టి.భవానీశంకర్, ఎఒ బి.నరసింహమూర్తిలు పరిశీలించారు. కార్యక్రమంలో అశోక్, బాబూరావు, రాజశేఖర్, నీటి సంఘం ప్రతినిధి శాంతారావు, వ్యవసాయ సహాయకులు మౌనిక, ఐశ్వర్య పాల్గొన్నారు.

మెళియాపుట్టి : మండలంలోని బందపల్లి నీలాపురం, జోడూరు, మారేడుకోట, కరజాడ, చంపాపురం గ్రామాల్లో ముంపునకు గురైన వరి పంట పొలాలను ఎఒ దానకర్ణుడు పరిశీలించారు. మండలంలోని 368 ఎకరాలు వరి పంట నష్టం ఉన్నట్లు ప్రాథమిక అంచనా వేశామన్నారు.

ఆమదాలవలస: మొంథా తుఫాను నేపథ్యంలో కురిసిన వర్షాలకు పంటలు దెబ్బతినకుండా రైతులు తగు జాగ్రత్తలు తీసుకోవాలని మండల వ్యవసాయాధికారి మెట్ట మోహనరావు అన్నారు. బుధవారం మండలంలోని బొబ్బిలిపేట, అక్కులపేట, నిమ్మతొర్లాడ, గరిమెల్ల, కొత్తవలస, కొరపాం తదితర గ్రామాల్లో పంట పొలాలను పరిశీలించి రైతులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తుపాను నేపథ్యంలో కురుస్తున్న భారీవర్షాల కారణంగా మండలం మొత్తం 13వేల ఎకరాల్లో వరిసాగు అవుతుండగా మొంథా తుపాను నేపథ్యంలో 210 ఎకరాల పంట నష్టం సంభవించినట్లు గుర్తించి ఉన్నతాధికారులకు నివేదించినట్లు తెలిపారు. పంటపొలాల్లో నీరు నిల్వ ఉండడం వలన వరి చేను పాడై నష్టాలు సంభవించే ప్రమాదం ఉందని రైతులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో ఎఇఒ రాము, గ్రామ వ్యవసాయ సహాయకులు, రైతులు పాల్గొన్నారు.

రణస్థలం రూరల్: మొంతా తుపానుపై రైతులు అప్రమత్తంగా ఉండాలని రాగోలు వరి పరిశోధన కేంద్రం శాస్త్రవేత్త జి.శ్రీనివాస్, మండల వ్యవసాయ అధికారి డి.విజయ్ భాస్కర్ అన్నారు. మండలంలోని వేల్పురాయి, కొండములగాం, కమ్మసిగడాం పంచాయతీల్లో బుధవారం పర్యటించారు. తుపాను వలన వరి పంటకు జరిగే నష్ట తీవ్రతను తగ్గించుకోవడానికి వరి పంటలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు రైతులకు వివరించారు. కార్యక్రమంలో రైతులు, గ్రామీణ వ్యవసాయ సహాయకులు పాల్గొన్నారు.

బూర్జ: రైతులు తగు జాగ్రత్తలు తీసుకుంటే నష్టాలను దూరం చేసుకునే అవకాశం ఉంటుందని మండల వ్యవసాయ అధికారి డి.ఉషారాణి అన్నారు. మండలంలోని కాలపర్తి గ్రామంలో వరి పంటను పరిశీలించారు. కార్యక్రమంలో పిఎసిఎస్ అధ్యక్షులు బగాది శ్రీరాములు నాయుడు, రైతు సేవా కేంద్రం సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

గండి పూడ్చివేత

నందిగాం : మండలంలోని పెద్దతామరపల్లి నుంచి తూముకడకు వెళ్లే ఆర్అండ్‌బి రోడ్డు కల్లాడ వద్ద తుపాను కారణంగా గండిపడింది. దీంతో 20 గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. సమాచారం అందుకున్న మండల ప్రత్యేక అధికారి ఐ.వి.రమణ, మండల అభ్యుదయ అధికారి కుమార్ పట్నాయక్ అక్కడకు చేరుకొని దిమ్మిడిజోల సర్పంచ్ ప్రతినిధి సలాన కృష్ణారావు నేతృత్వంలో గండిని బుధవారం పూడ్చివేశారు. కార్యక్రమంలో సర్పంచ్ కొంచాడ రమణయ్య, మండల ఇంజినీరింగ్ అధికారి సంతోష్ కుమార్, డిప్యూటీ ఎంపిడిఒ హరికృష్ణ పాల్గొన్నారు.

రూ.50 వేల నష్టపరిహారం అందించాలి

నందిగాం: తుపాను కారణంగా నష్టపోయి ప్రతి ఎకరాకూ రూ.50 వేలు నష్టపరిహారం అందించాలని వైసిపి నియోజకవర్గ సమన్వయకర్త పేరాడ తిలక్ డిమాండ్ చేశారు. మండలంలోని తామరాపల్లిలో నీటి మునిగిన పంట పొలాలను పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపిపి ఎన్.శ్రీరామ్మూర్తి పి.మోహనరావు, మాజీ ఎంపిపి కె.బాలకృష్ణారావు, మండల ప్రత్యేకాధికారి జోగారావు, జె.జయరాం, ఎస్.లావన్న పాల్గొన్నారు.

సోంపేట : మండలంలోని ఇసకలపాలెం ముంపునకు గురైన పంట పొలాలను ఎంపిపి నిమ్మన దాసు పరిశీలించారు. కార్యక్రమంలో బి.తిరుపతి, బి.రామారావు, దశరథ, ధర్మరాజు పాల్గొన్నారు.



నిలిచిన లారీ

నిలిచిన లారీ

పలాస : పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధి తాళభద్ర సమీప రహదారిపై బుధవారం ఓ లారీ వెనక్కి మళ్లించారు. ఈ క్రమంలో లారీ వెనుక టైర్లు ఇసుకలో కూరుకుపోయాయి. దీంతో రహదారిపై లారీ అడ్డంగా నిలిచిపోవడంతో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. ద్విచక్ర వాహనాలు, ఆటోలు మాత్రమే వెళ్లేందుకు అవకాశం ఉంది. దీంతో ఉద్దాన ప్రాంత గ్రామాలకు వెళ్లే ఆర్‌టిసి బస్సులకు తీవ్ర అంతరాయం ఏర్పడింది.

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం

ప్రజాశక్తి- కవిటి

మండలంలోని పొందూరుపుట్టుగకు చెందిన తాపీమేస్త్రీ దూగాన రామ్మూర్తి, అతని కుమారుడు ఇటీవల సంభవించిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి శ్రీకాకుళంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. వీరిలో మేస్త్రీ కుమారుడు ప్రణయ్ కోలుకుని ఇంటికి చేరుకోగా తండ్రి రామ్మూర్తి ఇంకా చికిత్స పొందుతున్నారు. ఈ విషయం తెలుసుకున్న పలు స్వచ్ఛంద సంస్థలు, వ్యక్తులు తమవంతుగా ఆర్థిక సహాయం అందజేస్తున్నారు. ఈ నేపథ్యంలో బుధవారం బాధిత కుటుంబానికి శ్రీశయన సంఘం సభ్యులు రూ.15,700లను అందజేశారు. కార్యక్రమంలో సంఘ అధ్యక్షుడు దీనబంధు, సలహాదారులు తాతయ్య, ఇంద్రరావు, తులసీరావు, ఢిల్లేశ్వరరావు, రుద్రయ్య, లోకనాథం, ప్రకాష్ పాల్గొన్నారు.

ఆహార పొట్లాలు పంపిణీ

ఇచ్ఛాపురం : మొంథా తుపాన్ కారణంగా మండలంలో డొంకూరులో నిరుపేద మత్స్యకార కుటుంబాలకు జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు డాక్టర్ పూడి కిరణ్ కుమార్ పరామర్శించారు. ఈ సందర్భంగా బాధిత కుటుంబాలకు వారి ఇళ్ల వద్ద శ్రీరామ రక్ష ఫౌండేషన్ వ్యవస్థాపకులు, తెలంగాణ బిసి తరగతి ప్రధాన కార్యదర్శి బొడ్డేపల్లి శ్రీరామచంద్రమూర్తి సహకారంతో ఆహార పొట్లాలు, పండ్లు, రొట్టెలు, బిస్కెట్లు అందించారు. నష్టపోయిన మత్స్యకారులను ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.